క్లుప్తంగా

వేసవిలో గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



ఫిరంగిపురం: వేసవిలో గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యురాలు శాంతి సూచించారు. మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 220 మంది రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్, యూరిన్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి మాట్లాడుతూ అడుగంటిన బావి నీటిని వాడుకునే సమయంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా తలపై వస్త్రాన్ని వేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ షేక్, అబ్దుల్ రెహమాన్, ఎంఎల్‌హెచ్‌పీ సాగర రాణి, ఏఎన్ఎం సరోజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ సీడీ సర్వే 50 శాతం పూర్తి



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధి 8 గ్రామాల్లో ముమ్మరంగా ఎన్‌సీడీసీడీ (సంక్రమిత, అసంక్రమిత వ్యాధులు)పై ఆరోగ్య సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. సోమవారం ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరికి సంబంధించిన ఆరోగ్యపరమైన విషయాలు నమోదు చేస్తున్నట్లు వైద్యాధికారి శ్వేత తెలిపారు. సర్వే ఇప్పటి వరకు 50 శాతం వరకు పూర్తి అయిందని చెప్పారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి లక్షణాలు ఉన్న వారి వివరాలు యాప్‌లో పొందుపరుస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాలను సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

తపోవనంలో శివరాత్రి వేడుకలు ప్రారంభం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని శ్రీ చైతన్య తపోవనంలో మహా శివరాత్రి వేడుకలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాతాశ్రీ ఆశ్రమంలో సాధన శిబిరం ప్రారంభించారు. పలువురు కళాకారులు శివనామంతో నృత్యాలు చేశారు. అనంతరం మాతా శివానంద మాట్లాడుతూ అందరూ కోరుకునే సుఖశాంతులు బయట లేవని, నిజ స్వరూపమైన ఆత్మలోనే ఉన్నాయని పేర్కొన్నారు. నృత్యాలు చేసిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. రామ చైతన్య స్వామి, ప్రణవానంద స్వామి, భక్తులు పాల్గొన్నారు.

పెండ్లి కుమారుడిగా కాశీవిశ్వేశ్వరుడు

మంగళగిరి: నగరప పరిధిలోని నవులూరు గోలివారితోటలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం మహా శివరాత్రి సందర్భంగా సోమవారం స్వామి వారికి పెండ్లి కుమారుడి ఉత్సవం నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, ఉత్సవమూర్తులకు అభిషేకం, నూతన వస్త్రాలతో విశేష అలంకరణ చేశారు. దేవస్థాన ప్రధాన అర్చకులు హనుమాన్ శాస్త్రి పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు ఆడేపు శివ నాగేశ్వరరావు, నందేశ్వరరావు, చక్రవర్తి, వెంకట ప్రమీల పాల్గొన్నారు.


డీవీఆర్‌కు కృతజ్ఞతలు



మంగళగిరి టౌన్: వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ ప్రచార విభాగ అధ్యక్షుడిగా నియమించబడిన తిరుమలశెట్టి సురేంద్ర కుమార్ సోమవారం ఆత్మకూరులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. సురేంద్ర కుమార్ మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పార్టీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, దొంతిరెడ్డి వేమారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు తాడేకోరు రమేష్‌బాబు, కట్టి పోగు సిసింద్రి, కోసూరి కోటేశ్వరరావు, దానబోయిన వెంకట్ పాల్గొన్నారు.

జీపీఎస్‌తో వాహనాలకు భద్రత

- వాహనం ఎక్కడ ఉన్నా తెలుసుకునే అవకాశం
- ఎలాంటి భయం లేకుండా నిశ్చింతంగా ఉండొచ్చు..







మంగళగిరి: వాహనాలు జీపీఎస్(గ్లోబల్ పొజిషినింగ్ సిస్టం) పరికరాల ఏర్పాటుతో భద్రంగా ఉంటాయి. వాహనం ఎవరన్నా దొంగిలించినా.. వెంటనే తెలిసిపోతుంది. ఈ పరికరాన్ని వాహనాలకు ఏర్పాటు చేస్తే.. దొంగల బారి నుంచి కాపాడుకోవచ్చు. వాహనానికి జీపీఎస్ ఉంటే ఎలాంటి భయం లేకుండా నిశ్చింతగా ఉండొచ్చు. ఉదాహరణకు పాత మంగళగిరికి చెందిన బిట్రా వెంకటేశ్వరరావు తన ఇంటి ముందు ద్విచక్ర వాహనం ఉంచాడు. తెల్లవారేసరికి వాహనం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొత్త పేటకు చెందిన హరికృష్ణ తన కారును రోడ్డుపైన పార్కింగ్ చేయగా తెల్లవారేసరికి కనిపించలేదు. అయితే కారుకు జీపీఎస్ ఉండడంతో కారు ఎక్కడుందో తెలుసుకున్న పోలీసులు వెంటనే కారును స్వాధీనం చేసుకుని హరికి అప్పగించారు. ద్విచక్ర వాహనానికి జీపీఎస్ లేకపోవడంతో ఇప్పటివరకు ఆచూకి లభించలేదు. పోలీసులు ప్రతి వాహనానికి జీపీఎస్ అమర్చుకోవడం మంచిదని చెబుతున్నారు. ఇటీవల ద్విచక్ర వాహనాలు, ఆటోల చోరీలపై పోలీసులకు అధికంగా ఫిర్యాదులందుతున్నాయి. కార్లు, లారీలు, బస్సులు సైతం కేటుగాళ్లు అపహరించుకెళ్తున్న ఉదంతాలు చోటు చేసుకుంటున్నాయి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా దొంగలను పట్టుకోవడానికి రోజులు, నెలలు, సంవత్సారాలు పడుతోంది. కొన్ని సందర్భాల్లో సంవత్సరాల తరబడి దొరక్కపోవడంతో ఆ వాహనాలను మరచిపోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. పేద, దిగువ, మధ్య తరగతి ప్రజలకు ఈ రోజులలో ద్విచక్ర వాహనం కొనుగోలు ఆర్థికంగా భారం. కానీ, నేరగాళ్లు నిముషాల వ్యవధిలో వారి కష్టాన్ని అపహరించుకెళ్తున్నారు. దీంతో బాధితుల ఆవేదన వర్ణాతీతం.

జీపీఎస్ అప్రమత్తం చేస్తుంది..

దొంగతనాల కట్టడికి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. నాణ్యతను బట్టి రూ.వెయ్యి నుంచి అందుబాటులో ఉన్నాయి. వాటిని ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, బస్సులు, లారీలు ఇలా అన్నిటికీ అమర్చుకోవడం ద్వారా దొంగల బారి నుంచి కాపాడుకోవచ్చు. జీపీఎస్ అమర్చాక యాప్ ద్వారా సెల్ ఫోన్‌కి అనుసంధానం చేసుకోవచ్చు. వాహనం పార్కింగ్ చేసిన చోటు నుంచి దొంగలు అపహరించుకువెళ్తుంటే.. వెంటనే అలారం మెగడంతో పాటు సెల్‌ఫోన్‌కి మెసేజ్ వస్తుంది. దీంతో అప్రమత్తం కావచ్చు. ఒక వేళ వాహనం తస్కరించుకు వెళ్లినా.. ఎక్కడ ఉందనేది జీపీఎస్ ద్వారా తెలిసిపోతుంది.

వాహనాలకు భద్రత



జీపీఎస్ పరికరాన్ని వాహనాలకు అమర్చుకుంటే భద్రత ఉంటుంది. నేరస్తులు ఆ వాహనాలను చోరీ చేసి తీసుకెళ్లినా.. ఎక్కడైనా దాచిపెట్టినా.. పోలీసుల సాహకారంతో వాటిని గుర్తించి తీసుకురావచ్చు. ప్రతి వాహనానికి యజమానులు తప్పనిసరిగా జీపీఎస్ పరికరాన్ని అమర్చుకోవాలి.

– మురళీకృష్ణ, డీఎస్పీ, నార్త్‌జోన్

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు

వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు

ఫిరంగిపురం: ప్రతి గ్రామంలో పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు పిలుపునిచ్చారు. మండలంలోని వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదన్నారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో పేద, బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో పథకాలు ద్వారా లబ్ధిచేకూరిందని గుర్తుచేశారు. కానీ, నేడు ఆ పరిస్థితి లేద జి మాట ప్రజల నుంచి విని పిస్తోందని చెప్పారు. ప్రస్తుతం అధికార పక్ష నాయకులు విపరీత ధోరణితో వ్యవహరిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తాను అండగా నిలుస్తానని చెప్పారు. ప్రతి కార్యకర్త, నాయకుడు సమష్టిగా నిలిచి పార్టీ గెలుపు కోసం కృషిచేయాలని కోరారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు ఎల్లప్పుడు తాను ముందుంటానని చెప్పారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా, కె.చిన్నప్పరెడ్డి, చిట్టా.అంజిరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గాంధీబుడే, మీరావలి, షేక్.సుబానీ, రామమోహన్ రెడ్డి, సంజీవరెడ్డి, పి.చిన్నా, ఆర్.రంజన్‌బాబు, ఇజ్రాయిల్, వెంకట్రావు, ఇస్మాయిల్, షరీఫ్, జానీ, మాబుల్లా, కరిముల్లా, సుబానీ, బాబురావు, బాబు, మౌలాలి పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



చినకాకాని వాటర్ ట్యాంక్ వద్ద తాగునీటి సరఫరా పరిశీలిస్తున్న కమిషనర్

మంగళగిరి: వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ ఆలీంబాషా అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ పరిధిలోని చినకకాని, నులకపేట ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త ఎప్పటికప్పుడు యార్డుకు తరలించాలని, ఇంటి ముందు చెత్త నిల్వలు ఉంచితే దాని వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. అన్న క్యాంటీన్లు పరిశీలించి ఆహారం శుభ్రత, నాణ్యత, టోకన్ల పంపిణీలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణరావు గెలుపునకు కరపత్రాల పంపిణీ



కరపత్రాలు అందజేసిన నాయకులు

ఫిరంగిపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరపున సోమవారం ఫిరంగిపురంలో పలు సంఘాల నాయకులు ప్రచారం చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ వివిధ ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ, ఔట్ సోర్సింగ్, కౌలు రైతు సంఘం బలపర్చిన అభ్యర్థి లక్ష్మణరావు అని తెలిపారు. సమస్యలు తీరాలంటే లక్ష్మణరావు గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం కొండమెట్ల బజారు, ప్రధాన రోడ్డు, రామాలయం బజారు ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన వెంట రైతు సంఘం నాయకుడు ఆకారపు అంకమ్మరావు, జె.బాలశౌరి, షేక్.మస్తాన్‌వలి, ఉదయ్ ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపునకు ప్రచారం



అంగన్‌వాడీ కార్యకర్తలను ఓట్లు అభ్యర్థిస్తున్న వేముల దుర్గారావు

తాడేపల్లిరూరల్: కృష్ణ, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకుందామని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో అంగన్‌వాడీలో కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 రోజులకు పైబడి అంగన్‌వాడీ సమస్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలు చేసిన సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేయడమే కాక, శాసనమండలిలో అంగన్‌వాడీల సమస్య పరిష్కారం చేయాలని లక్ష్మణరావు విశేషంగా కృషి చేశారని చెప్పారు. నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపైనే కాకుండా అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై శాసన మండలిలో పోరాటం చేసిన లక్ష్మణరావును గెలిపించుకోవాలన్నారు. ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి పట్టణ నాయకులు బూరుగ వెంకటేశ్వరరావు, దొంతిరెడ్డి విజయ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

పెనుమూలిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

దుగ్గిరాల: మండలంలోని పెనుమూలి గ్రామంలో ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరపున సోమవారం ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి, లక్ష్మణరావుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో కార్మిక నాయకుడు జెట్టి బాలరాజు, స్టాలిన్, వై.బ్రహ్మశ్వరరావు, అమ్మిరెడ్డి పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తాడేపల్లిరూరల్ : ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తాడేపల్లిలోని పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సీతారామాంజనేయులు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్రాల వద్ద బారికేడ్లు, ఇతర మౌలిక వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. పోలీసులు ప్రతి పోలింగ్ బూత్‌లో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సిబార్, ఎస్ఆర్ఎం ఎంఓయూ



మంగళగిరి: మండలంలోని నీరుకొండ ఎస్ఆర్ఎం యూనిర్శిటీ, సిబార్ దంత కళాశాల మధ్య ఎంఓయూ కుదిరింది. సోమవారం యూనిర్శిటీలో ఇరు ప్రతినిధులు ఒప్పందం చేసుకున్నారు. దంత సమస్యలు, వాటి పరిష్కారంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎంఓయూ ఉపకరిస్తుందని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, సిబార్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటర మణారెడ్డి, డీన్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. డీన్ కృష్ణ ప్రసాద్ సిబార్ రీసెర్చ్ పురోగతిని, వీసీ ప్రొఫెసర్ మనోజ్‌కుమార్ అరోరా యూనివర్శిటీలో కొనసాగుతున్న పరిశోధనల పురోగతిని వివరించారు. రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ రంజిత్ థాపా, ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ సీవీ టామి, రిజిస్ట్రార్‌లు యూనివర్శిటీలో జరిగే భోధనా, పరిశోధనల గురించి వివరించారు. సిబార్ కళాశాల డాక్టర్లు కిరణ్‌కుమార్, చంద్రశేఖర్, రవీంద్రనాథ్, ఎస్ఆర్ఎం ప్రతినిధులు డాక్టర్లు జయశీలన్, పార్థసారథి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కమిషనర్



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా తదితరులు

మంగళగిరి టౌన్ : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27వ తేదీన జరుగనున్న నేపథ్యంలో మంగళగిరి నగర పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎంటీఎంసీ కమిషనర్ అలిమ్ బాషా సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా, ర్యాంప్, టాయిలెట్స్, మంచినీటి సౌకర్యం కల్పించాలని సిబ్బందికి చెప్పారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎటువంటి అవాంతరాలు లేకుండా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మంగళగిరి నగర పరిధిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో ఐదు పోలింగ్ కేంద్రాలను, సీకే హైస్కూల్‌లో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మంగళగిరి అర్బన్ పరిధిలో 4,500 మంది, రూరల్ పరిధిలో 3,591 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలో ఓటర్లకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వహించరాదని ఆయన సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశం



సమావేశానికి హాజరైన అధికారులు

మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఏటా వైభవంగా జరుగుతాయి. పొన్న వాహనం, కల్యాణ మహోత్సవం, దివ్య రథోత్సం రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఉత్సవాలకు రెండు నెలల ముందే అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఆధ్యాత్మిక వేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి, సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటారు. అయితే ఈ ఏడాది ఉత్సవాలపై అధికారులు నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు. సోమవారం బ్రహ్మోత్సవాలపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. అన్ని శాఖల అధికారులు కూడా పాల్గొనక పోవడం విశేషం. జిల్లా నుంచి ఏ ఒక్క అధికారి రాలేదు. స్థానికంగా మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ అంకమ్మరావు, మెడికల్ ఆఫీసర్ పి.అనూష, విద్యుత్ శాఖ ఏఈ, పోలీస్ శాఖ నుంచి ఎస్ఐ వెంకటేష్ హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం మరోసారి సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఏసీపీ ఎ.రామకోటిరెడ్డి తెలిపారు.

ఉత్సాహంగా ఫేర్వెల్ డే



పదో తరగతి విద్యార్థినులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

దుగ్గిరాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్న పాఠశాలలో సోమవారం పదోవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. 9వ తరగతి విద్యార్థులు తమ సీనియర్స్‌కు ట్రావెల్ బ్యాగులు బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శోభాదేవి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. పాఠశాలకు మంచి పేరు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల కష్టాలు తీర్చాలి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. సోమవారం ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న నిరాహార దీక్ష శిబిరాన్ని వారు సందర్శించి, కార్మికులకు మద్దతు తెలియజేశారు. మాట్లాడుతూ కోర్టు తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని, తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం మాత్రమే వారు అడుగుతున్నారని ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదనం, మాణిక్యరావు, సీహెచ్ యోహాన్, సూర్యప్రకాష్‌రావు, అగ్గయ్య, ఎస్.సుబ్బారావు, బుజ్జి, దుర్గాభవాని, రిబ్కా, శివకుమారి పాల్గొన్నారు.

పొగాకు వ్యసనం నుంచి బయట పడాలి



బీపీ చెక్ చేస్తున్న ఫార్మసీ విద్యార్థిని

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో వడ్డేశ్వరం గ్రామంలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలను ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సోమవారం వివరించి, అవగాహన కల్పించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులకు బానిసలైన వారు ఆ వ్యసనం నుంచి బయటపడి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. సిగరెట్, బీడీ, గుట్కా, ఖైనీ తదితర పొగాకు ఉత్పత్తులు వాడడం వల్ల నోరు, గొంతు తదితర అవయవాలకు కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. గుండె, ఊపిరితిత్తుల అనారోగ్య సమస్యలు వస్తాయని వివరించారు. నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ, యోగ, ధ్యానం, వ్యాయామం, కుటుంబ సభ్యుల మద్దతు ద్వారా పొగాకు ఉత్పత్తుల వ్యసనం నుంచి బయటపడవచ్చని విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ సూచించారు. అనంతరం గ్రామస్తులకు రక్త పోటు, బరువు, ఎత్తు పరీక్షలు నిర్వహించి బీఎంఐపై అవగాహన కల్పించారు. విద్యార్థులను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకురాలు డాక్టర్ టి.శ్రావణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియ, సమన్వయ కర్త పి.సురేష్, వలంటీర్లను యూనివర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్ అభినందించారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఆందోళన..

తాడికొండ: రాజధాని ప్రాంతం తుళ్లూరులో అక్రమ రిజిస్ట్రేషన్‌పై బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా ఇంటి పన్ను చెల్లిస్తున్న పక్కా గృహం ఉన్న స్థలాన్ని పంచాయతీ కార్యదర్శి ఖాళీ స్థలంగా ఎన్‌వోసీ జారీ చేయడంతో.. 130 గజాల స్థలాన్ని వారసులకు తెలియకుండా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన ఘటన ఈ నెల 20న తుళ్లూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగిందని వాపోయారు. వివరాల మేరకు.. తుళ్లూరు గ్రామంలోని సర్వే నెంబర్ 76/ఏ2లో 130 గజాల స్థలంలో పెంకుటిల్లు ఉంది. అందులో ఆస్తి వారసురాలు జమ్ముల కోటేశ్వరమ్మ నివసిస్తోంది. గృహానికి అసెస్‌మెంట్ నంబర్ 410 ద్వారా ఏటా ఇంటి పన్ను కూడా చెల్లిస్తున్నారు. ఈ స్థలానికి సంబంధించి తమకు వారసత్వం ఉందని చూపిస్తూ ఆమర్తి వెంకటపతిరావు 4వ సంతానం ఆమర్తి వెంకట్రావు తన సొంత సోదరికి రిజిస్ట్రేషన్ చేశారు. ఇందుకు సంబంధించి వెంకటపతిరావు ఏడుగురి సంతానం నుంచి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేకుండా, వారి ఆమోదం పొందకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తప్పుడు రిజిస్ట్రేషన్ జరిగిందని మరో కుమారుడు ఆమర్తి సాంబశివరావు, ఇతరులు తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌తో పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ తండ్రికి ఏడుగురు సంతానమని, ఒక్కడికే ఎలా వారసత్వం వస్తుందని ప్రశ్నించారు. అసలు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేకుండా, ఇంటి పన్ను కడుతున్న స్థలాన్ని ఖాళీ స్థలంగా ఎలా ఎన్‌వోసీ జారీ చేశారో నిగ్గుతేల్చాలని నిలదీశారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకొని తప్పుడు రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు ఎన్‌వోసీపై తాను పంచాయతీ కార్యదర్శికి ఫోన్ ద్వారా సంప్రదించగా దురుసుగా సమాధానం చెప్పాడని చెప్పారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పినా.. నీ ఇష్టమొచ్చింది చేసుకో అని అన్నాడని తెలిపారు. అధికారులు స్పందించి తప్పుడు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తన తాత, బావమరుదలకు చెందిన ఆస్తిని వారి వారసులకు చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా ఈ వ్యవహారం మొత్తంలో తుళ్లూరుకు చెందిన ఓ కీలక టీడీపీ నాయకుడు హస్తం ఉండటం విశేషం. తప్పుడు రిజిస్ట్రేషన్‌లోనూ, తదనంతరం వచ్చిన వారసత్వ హక్కుల విషయంలో చేసిన ఫిర్యాదులోనూ ఆయనే కీలకంగా ఉండి ఫిర్యాదు చేయించిన అనంతరం సెటిల్‌మెంట్ చేసేందుకు యత్నాలు ప్రారంభించారు.

జౌళి శాఖకు బడ్జెట్‌లో నిధులు పెంచాలి



మంగళగిరి టౌన్: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి రెండు వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం మంగళగిరి నగర పరిధిలో ఉన్న చేనేత జౌళి శాఖ కార్యాలయంలోని అడిషనల్ డైరెక్టర్ కె. శ్రీకాంత్ ప్రభాకర్‌కు ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు బకాయిలు రూ.172 కోట్లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో చేనేత పరిశ్రమకు రూ.2 వేల కోట్లు కేటాయించని పక్షంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఏపీ చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకట కృష్ణ, మోహనరావు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి గంజి చిరంజీవి పాల్గొన్నారు.